# భూపతిపాలెం కాలువ ద్వారా రైతులకు తక్షణమే సాగునీరు అందించాలి





- సాగునీటి కోసం రైతుల మోటార్‌సైకిల్ ర్యాలీ
- ఆగస్టు 24న చలో కలెక్టరేట్‌కు పిలుపు

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 21:** భూపతిపాలెం ప్రాజెక్టు కాలువల ద్వారా రైతులకు తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గంగవరం మండలం కొత్తాడ గ్రామం నుంచి రైతుల పోరు యాత్ర, మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ, భూపతిపాలెం ప్రాజెక్టు రైతుల సాగునీటి పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాత్రలో కొత్తాడ, పెదగార్లపాడు, గొరగొమ్మి, లక్కొండ, గంగవరం, దొరమామిడి, అముదాలబంధ, రాజంపాలెం, కుసుమరాయి తదితర గ్రామాల్లో నాయకులు, రైతులు పర్యటించారు.

కొత్తాడలో జరిగిన కార్యక్రమాన్ని గంగవరం మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) పల్లాల కృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. భూపతిపాలెం ప్రాజెక్టు పరిధిలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట కాలువలు దెబ్బతినడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించి ప్రతి రైతు పొలానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ భూపతిపాలెం ప్రాజెక్టు కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సాగునీరు అందక పంటలు నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు రైతుల పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ప్రధాన డిమాండ్లు**

భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు పొందాల్సిన ప్రతి రైతు పొలానికి సక్రమంగా నీరు అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంట కాలువలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. సాగునీటి సమస్యల కారణంగా నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు జలధార--జలహారతి పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భూపతిపాలెం ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కాలువల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**ఆగస్టు 24న చలో కలెక్టరేట్**

సాగునీటి సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 24న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆదివాసి గిరిజన సంఘం, భూపతిపాలెం ప్రాజెక్టు రైతుల సాగునీటి పోరాట కమిటీ నాయకులు ప్రకటించారు. అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మోటార్‌సైకిల్ యాత్రలో భూపతిపాలెం ప్రాజెక్టు రైతుల సాధన కమిటీ నాయకులు కోసూరు రాజారెడ్డి, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, జిల్లా నాయకులు కంభం శాంతిరాజు, సాదాల విద్యాసాగర్‌రెడ్డి, మట్ల వాణిశ్రీ, తీగల శ్రీనివాస్, పెసా కార్యదర్శి యాట్ల సరస్వతి, తాము బాపన్న దొర, ఒండోపు శివ, సారపు తమ్మన్న దొర, లోత భారతి తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# నన్నయ వర్సిటీకి బగ్గీ కార్ట్ వాహనం యూనియన్ బ్యాంక్ వితరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 21:** ఆదికవి నన్నయ యూనివర్సిటీకి బగ్గి కార్ట్ ఎలక్ట్రికల్ వెహికల్ ను యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ సి ఎస్ ఆర్ నిధులు ద్వారా బహుకరించారు. ఈ వాహనాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ, యూనియన్ బ్యాంక్ రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ ఏ విశ్వేశ్వరరావు ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అధికారులు, బ్యాంక్ అధికారులు వాహనంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ కి బగ్గి కార్ట్ వాహనం ను యూనియన్ బ్యాంక్ బహుకరించడం ఆనందంగా ఉందన్నారు. రూ. 5.72 లక్షల విలువైన ఈ వాహనం విశ్వవిద్యాలయానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అతిథులు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రయాణం చేయడానికి ఈ వాహనాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. రీజనల్ హెడ్ ఏ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం అభివృద్ధిలో తాము భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. బ్యాంకు తరపున విశ్వవిద్యాలయానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రిజిస్ట్రార్ డా.కె.రమణేశ్వరి, యూనివర్సిటీ క్యాంపస్ యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకట సురేష్ కుమార్ అత్తిలి, యూనియన్ బ్యాంక్ సిబ్బంది మురళీకృష్ణ, లావణ్య, పుష్పలత, శ్రీనివాస్ విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు



# బుర్కానకోటలో రైతులకు ఉచిత మునగ విత్తనాల పంపిణీ

**చింతూరు, పన్ పవర్ ఆగస్టు 21:** బుర్కానకోట గ్రామంలో పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు ఉచితంగా మునగ విత్తనాలను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజల్లో పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగలో అధిక మొత్తంలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి రైతు తమ పొలం గట్లు, చేలు గట్లు, ఇంటి పరిసర ప్రాంతాల్లో మునగ మొక్కలను నాటి, వాటి ఆకులు, కాయలను నిత్యాహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిలో కనీసం ఒక మునగ మొక్క ఉండేలా ప్రజలు ముందుకు రావాలని, తద్వారా కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు గ్రామాల్లో పోషకాహార భద్రత కూడా పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, మహిళలు, పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 21;** నేర స్థల పరిశీలనలో చిన్నపాటి సంఘటన కూడా ప్రభావం చూపుతోందని జీలుగుమిల్లి సీఐ బి యాదగిరి అన్నారు. శుక్రవారం జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో నేరస్థల పరిశీలనపై పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సందర్భంగా మాట్లాడుతూ సాక్ష్యాలను శాస్త్రీయంగా సేకరించి పకడ్బందీగా భద్రపరచడం ద్వారా నేరాలను ఛేదించడంలో విజయం సాధించవచ్చు అని అన్నారు. నేర స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించే విధానం, నేరస్తుల ఫోటోగ్రఫీ, సీన్ ఆఫ్ ఎఫెక్ట్ చిత్రీకరణ, ఘటన స్థల స్కెచ్ తయారు చేయడం, సాక్ష్యాలు నమోదు నివేదిక తయారీ విధానం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, టి నరసాపురం ఎస్సైలు వి క్రాంతికుమార్, చెన్నారావు, జయ బాబు., సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుపై దాడిని ఖండించిన గంగవరం ప్రెస్ క్లబ్

**దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 21:** విజయనగరం జిల్లాలో విశాలాంధ్ర రిపోర్టర్ పందిరిపల్లి గోవింద్‌పై ఈ నెల 19న రియల్ ఎస్టేట్ మాఫియాకు చెందిన వ్యక్తులు దాడి చేశారన్న ఘటనను ఖండిస్తూ గంగవరం ప్రెస్ క్లబ్ సభ్యులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగవరం ప్రెస్ క్లబ్ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఏఎస్ఐ వీర్రాజు కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుపై దాడికి పాల్పడిన వ్యక్తులను తక్షణమే గుర్తించి, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి కారణమైన అంశాలను సమగ్రంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందని ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. జర్నలిస్టులపై దాడులను సహించరాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. పందిరిపల్లి గోవింద్‌పై దాడి చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టి, బాధిత జర్నలిస్టుకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పాత్రికేయుల భద్రతకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గంగవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పి. జయకృష్ణ పట్నాయక్, కార్యదర్శి రమేష్, సభ్యులు ప్రభాకర్, ఉదయ్, శ్రీనివాస్, ప్రసన్న, రాజారెడ్డి, శ్రీనివాస్, రత్నం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఉద్యోగుల ప్రయోజనాల కోసం నిరంతర కృషికి మరో ఫలితం

**మూడు జిల్లాల్లో హెచ్‌ఆర్‌ఏ 12 నుంచి 16 శాతానికి పెంపు..**

**జీవో నెం.78 విడుదలపై ఏపీ జేఏసీ నేతల హర్షం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 21:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఏపీ జేఏసీ రాష్ట్ర నాయకత్వం చేస్తున్న నిరంతర కృషికి మరో ఫలితం లభించిందని పోలవరం జిల్లా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఆడహక్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. పోలవరం (రంపచోడవరం), మార్కాపురం, అన్నమయ్య (మదనపల్లె) జిల్లాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ)ను 12 శాతం నుంచి 16 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జీవో నెం.78 జారీ చేయడం ఉద్యోగుల పోరాటానికి లభించిన విజయమని వారు అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆడహక్ కమిటీ చైర్మన్ ఎస్‌కే ఫయాజ్ భాష (జిలాని), సభ్యులు ఎం.ఎస్. వెంకటేష్, కే. లక్ష్మణరావు, వి. పాల్ అలెగ్జాండర్, ఆర్. మహాలక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం రాష్ట్ర జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని పేర్కొన్నారు. హెచ్‌ఆర్‌ఏ పెంపు కోసం ఉద్యోగులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారని, జీవో నెం.78 విడుదలతో పోలవరం, మార్కాపురం, అన్నమయ్య జిల్లాల ఉద్యోగులకు ప్రయోజనం కలగనుందని జిలాని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా, హక్కుల సాధనే ధ్యేయంగా ఏపీ జేఏసీ నిరంతరం పనిచేస్తోందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లోనూ పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ఈ నెల 28న రాష్ట్ర సదస్సు**

విజయవాడలో ఈ నెల 28న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పోలవరం జిల్లా ఆడహక్ కమిటీ నాయకులు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# 15వ డివిజన్ లో రూ.28 లక్షలతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 21:** కూటమి ప్రభుత్వం 15వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. తాడితోట జీవీ మాల్ వద్ద రూ.28 లక్షలతో ఆర్సీసీ డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పై నుంచి వస్తున్న మేజర్ డ్రైనేజీని కిందకు వెళ్లే మేజర్ డ్రైనేజీకి అనుసంధానం చేసేలా ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 15వ డివిజన్‌లో సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, పుష్కరాలకు మరో రూ.1.50 కోట్లతో పనులు చేస్తూన్నామని చెప్పారు. అయ్యప్పనగర్‌లో సింగిల్‌ఫేజ్ విద్యుత్ సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించిదని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. రెల్లిపేటలోని సుమారు 185 మంది రిక్షా కార్మికుల వేతనాలను రూ.9 వేల నుంచి రూ.15 వేలకు పెంచామ న్నారు. రెల్లి సామాజిక వర్గానికి చెందిన 79 మంది పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు చేపట్టామని ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. కుటుంబ సభ్యులకు కూడా అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే రూ.250 కోట్ల పనులకు టెండర్లు జరుగుతూన్నాయని చెప్పారు. మరో రూ.250 కోట్ల విలువైన పనులకు పరిపాలనా అనుమతులు లభించాయని, త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొడమళ్ళ శ్రీనివాస్, మస్తాన్ చౌదరి, కొల్లి బుజ్జి, నీలాపు వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, స్వర్ణ, ఇంద్ర, రాజు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# డీసిల్టింగ్ పనులు ప్రణాళికతో చేయాలి



**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 21:**నగరంలో మేజర్, మైనర్ డ్రెయిన్లలో చేపట్టిన పూడికతీత పనులు పక్కాగా జరగాలని పనులకు ముందు, అనంతరం ఫోటోలను పోస్ట్ చేయాలని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. ఆదెమ్మ దిబ్బ, స్వతంత్ర హాస్పిటల్ రోడ్డులో ఆయన విస్తృతంగా పర్యటించారు. వర్షాకాలం దృష్ట్యా నగరంలో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను ప్రణాళికతో చేయాలని, ప్రతి డ్రెయిన్ లో నూరు శాతం పూడికతీసి, స్థానికులతో సంతకాలు చేయించాలన్నారు. చిట్టచివరి ప్రాంతం వరకు డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేస్తేనే వర్షాల సమయంలో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండవన్నారు. మురుగు కాలువల మధ్య లేదా లోపల త్రాగునీటి పైపులైన్లు వెళ్తుంటే, వెంటనే తొలగించి వేరే సురక్షిత ప్రాంతాలకు మార్చాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్ఓ వినూత్న, ఇతర పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

# పెద్దిపాలెం ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ అంతరాయం

-ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 21:**ప్రత్తిపాడు మండలంలోని 11 కేవీ పెద్దిపాలెం ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుండనున్నట్లు జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బి వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.లైన్ మరమ్మతులు, లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు,ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.పెద్దిపాలెం, వేములపాలెం,
రౌతుపాలెం,గోకవరం,
మెట్టిచింత,వంతాడ,ఉల్లిగోగుల,బాపన్నదొర,
కిట్టమూరుపేట,బురదకోట గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.అదేవిధంగా పెద్దిపాలెం ఫీడర్ పరిధిలోని వ్యవసాయ బోర్లకు ఉదయం 4 నుంచి 9 గంటల వరకు,తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంటుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి వీరభద్రరావు ఈ సందర్భంగా తెలిపారు.

# 15వ డివిజన్‌లో ఇంటింటికి తెలుగుదేశం ప్రచారం



**రాజమహేంద్రవరం,, పెన్ పవర్, ఆగస్టు 21:** అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమలు అందించడంతో పాటు సమగ్ర అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వామే నని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇంటింటికీ టీడీపీ -- ఇంటింటికీ సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 15వ డివిజన్ తాడితోటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల ప్రకటన చారిత్రాత్మకం: ఓ బి సిరాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్





**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 21:**బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన తరగతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసే దిశగా ఈ నిర్ణయం సామాజిక విప్లవానికి నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా అయినవిల్లి సత్తిబాబు గౌడ్ మాట్లాడుతూ, జనాభాలో అత్యధికంగా ఉన్న వెనుకబడిన వర్గాల సమగ్ర అభివృద్ధికి, రాజకీయ సామాజిక సాధికారతకు 34 శాతం రిజర్వేషన్లు కీలక మైలురాయిగా నిలుస్తాయని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయానికి బీసీల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.చట్టసభలు, స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం లభించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ రిజర్వేషన్లు బీసీ వర్గాల్లో సరికొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు రాజకీయ సాధికారతకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వ నిర్ణయంపై ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ రాంబాబు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సత్యప్రసాద్, డీఎన్‌టీ (ఐచీ) సెల్ జిల్లా కన్వీనర్ వీర్నాల రమణబాబు, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు మిద్దె పురుషోత్తం, బొర్రా ఆంజనేయులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.సామాజిక సమానత్వానికి పెద్దపీట వేసిన ప్రభుత్వానికి బీసీల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్ల ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేసి, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేదవాడి గడపకూ చేరేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# అదుపుతప్పి షాపులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్





**పెన్ పవర్, ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల, ఆగస్టు 21:**
ద్వారకాతిరుమల స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న ఏసీ, ఫ్రిడ్జ్ రిపేర్ షాపులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో తాపీ పని చేస్తున్న దొరసానిపాడు గ్రామానికి చెందిన తొందుర్తి రత్తయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.
దొరసానిపాడు నుంచి ద్వారకాతిరుమల వైపు వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఒక్కసారిగా షాపులోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న రత్తయ్యను ట్రాక్టర్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆయనను ద్వారకాతిరుమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.
ట్రాక్టర్ తాడేపల్లిగూడెం సమీపంలోని మంగిపాడు గ్రామానికి చెందినదిగా స్థానికులు తెలిపారు. ద్వారకాతిరుమల పరిసర గ్రామాలకు పెంట ఎరువులు తరలించి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు వారు పేర్కొన్నారు.ద

# ప్రభుత్వ ఆసుపత్రులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత




**చింతూరు, పెన్ పవర్ ఆగస్టు 21:** పేదలు, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆయా ఆసుపత్రులకు అవసరమైన సహకారం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ అన్నారు. జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎటపాక మండలం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బెడ్‌షీట్లు, దిండు కవర్లు అందజేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సామగ్రిని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొహమ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై పేదలు, గిరిజన ప్రజలు అధికంగా ఆధారపడుతున్నారని అన్నారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా తమ ట్రస్ట్ తరఫున చేతనైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించడమే తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో కూడా జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలు, గిరిజన కుటుంబాలకు వివిధ రూపాల్లో సహాయం అందించామని తెలిపారు. భవిష్యత్తులో విద్య, వైద్యం, పేదల సంక్షేమం, అత్యవసర సహాయం వంటి రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన సామగ్రిని అందించిన జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను ఆసుపత్రి సిబ్బంది అభినందించారు. రోగులకు ఉపయోగపడే విధంగా అందించిన సామగ్రిని వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశ్వచైతన్య, డాక్టర్ రాజశేఖర్, ఎటపాక మండల టీడీపీ కార్యదర్శి కణితి మధు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంకేఎస్ జాతీయ నాయకులకు ఘన నివాళులు





**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 20:** అఖిలభారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకేఎంకేఎస్) జాతీయ ఉపాధ్యక్షులు కామ్రేడ్ హరదేవ్ సింగ్ సంధు, జాతీయ నాయకులు కామ్రేడ్ శంభూ మహతోల సంస్మరణ సభను గంగవరం మండలం కొండమొదలు గ్రామంలో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు కామ్రేడ్ వేట్ల విజయ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి మాట్లాడుతూ హరదేవ్ సింగ్ సంధు పంజాబ్ రాష్ట్రానికి చెందిన నాయకుడని, రైతులు, వ్యవసాయ రంగ సమస్యలపై సుదీర్ఘకాలం పోరాటం చేశారని తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్‌లో బీహార్‌లోని ససారాంలో జరిగిన ఏఐకేఎంకేఎస్ మహాసభల్లో జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని, జూలై 26న గుండెపోటుతో మృతి చెందారని పేర్కొన్నారు. ఆయన మరణం ప్రజా, రైతాంగ, గిరిజన ఉద్యమాలకు తీరని లోటని అన్నారు.

జార్ఖండ్‌కు చెందిన మరో జాతీయ నాయకుడు కామ్రేడ్ శంభూ మహతో గిరిజనులు, రైతుల హక్కుల కోసం విశేషంగా పోరాడారని రామిరెడ్డి తెలిపారు. హూల్ జార్ఖండ్ క్రాంతి దళ్‌ను ఏర్పాటు చేసి ప్రజా హక్కుల కోసం ఉద్యమించారని, 1970లలో జరిగిన పోలీసు, సీఐఎస్ఎఫ్ తిరుగుబాటులో పాల్గొని ఉద్యోగాన్ని కోల్పోయారని చెప్పారు. అనంతరం పోరాట ఫలితంగా ఉద్యోగం తిరిగి వచ్చినప్పటికీ దానిలో చేరకుండా విప్లవ ఉద్యమంలో కొనసాగారని తెలిపారు. అనేక కేసులు, జైలు నిర్బంధాలను ఎదుర్కొన్నప్పటికీ ఉద్యమాల్లో చివరి వరకు పనిచేశారని, నరాల వ్యాధితో ఆగస్టు 11న మృతి చెందారని పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని రామిరెడ్డి అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మృతి చెందిన కామ్రేడ్ల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు.

సభలో ఏజెన్సీ గిరిజన సంఘం సహాయ కార్యదర్శి తాతి బుల్లెబ్బాయి, వేట్ల సత్యనారాయణ, రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంజాం జోగారావు తదితరులు ప్రసంగించారు. అనంతరం హరదేవ్ సింగ్ సంధు, శంభూ మహతో చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు

: కూటమి ప్రభుత్వంపై నులుకుర్తి ప్రశంసల జల్లు



**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 21:** కాకినాడ రూరల్ మండలం 47వ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం స్థానిక ప్రజలు, కూటమి శ్రేణుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో కోలాహలంగా సాగింది. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను ప్రజల వద్దకే తీసుకువెళ్తోందని మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతుల నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావులతో కలిసి నులుకుర్తి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన సామాజిక పింఛన్లు, మహిళా సాధికారతకు అందిస్తున్న ప్రాధాన్యత, రైతులకు అందుతున్న ఆర్థిక సాయం, విద్యా, వైద్య రంగాల్లో చేపట్టిన మార్పులు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఎలాంటి వ్యత్యాసం లేకుండా సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షుడు ఎం. బాబురావు, కూటమి నాయకులు బి.నాగరాజు,మద్దాల రామారావు,కోనాల కృష్ణ, ఎలగా లోవరాజు, కొమిరిశెట్టి నరసింగరావు, కాళ్ల శ్రీను, కొండా వినాయక్, కొల్లాబత్తుల లక్ష్మి, అన్నపూర్ణ, మాత లక్ష్మణ్,చొక్కా జగన్,భాస్కర్,మేడిశెట్టి బుజ్జి, సందీప్,తేజ, అభిరామ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రమా లక్ష్మీదేవి బాధ్యతల స్వీకరణ



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 21:** కాకినాడ ఆర్టీసీ నూతన డిపో మేనేజర్‌గా గంగుమళ్ల రమా లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అమలాపురం డిపోలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఆమెకు పదోన్నతిపై కాకినాడ డిపో మేనేజర్‌గా నియామకం లభించింది.ఇటీవల కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారిగా పదోన్నతి పొందిన ఎంయువి మనోహర్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిపో అధికారులు, సిబ్బంది నూతన డిపో మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎ.మాలిమ్ భాష, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) కే. శ్రీనివాస్‌తో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమ్మడి గోదావరి జిల్లాల క్యాన్సర్ రోగులకు తీపి కబురు



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 21:** ఉమ్మడి గోదావరి జిల్లాల క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటు కానుంది. రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు చొరవతో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో హై ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్, సీటీ సిమ్యులేటర్ వంటి ఆధునిక పరికరాలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నందున ఆధునిక రేడియేషన్ థెరపీ సదుపాయాలు కల్పించాలని ఎంపీ సానా సతీష్ బాబు ఆగస్టు 3న కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆగస్టు 7న ఓఎన్‌జీసీ నుంచి కాకినాడ జీజీహెచ్‌కు ఒప్పంద పత్రం అందగా, ఆగస్టు 12న జీజీహెచ్ అధికారులు ఒప్పందంపై సంతకాలు చేసి తిరిగి పంపించారు. దీంతో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ,గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధునాతన క్యాన్సర్ చికిత్స సదుపాయాల కోసం సుమారు రూ.48 కోట్లను కేటాయించేందుకు అంగీకరించింది. ఒక్కో కేంద్రానికి సుమారు రూ.16 కోట్ల చొప్పున నిధులు కేటాయించనున్నారు. కాకినాడ జీజీహెచ్‌కు అవసరమైన అధునాతన యంత్ర సామగ్రిని కూడా ఓఎన్‌జీసీ సమకూర్చనుంది.ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో క్యాన్సర్ రోగులు కాకినాడ జీజీహెచ్‌కు వస్తుంటారు. ప్రస్తుతం అత్యాధునిక క్యాన్సర్ చికిత్స కోసం విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి రావడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది. కాకినాడలోనే ఆధునిక చికిత్స అందుబాటులోకి వస్తే వేలాది మంది రోగులకు ప్రయోజనం కలగడంతో పాటు వైద్య ఖర్చులు, సుదూర ప్రయాణాల భారం తగ్గనుంది.క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటుకు ఎంపీ సానా సతీష్ బాబు ఢిల్లీలో ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చించి, ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజలకు ఈ సదుపాయం అవసరాన్ని వివరించారు. ఆయన నిరంతర ప్రయత్నాలు, కేంద్ర ప్రభుత్వ సమన్వయం, ఓఎన్‌జీసీ సహకారంతో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చుతోంది. అవసరమైన మౌలిక వసతులు, పరికరాల ఏర్పాటు పూర్తయిన అనంతరం కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్స సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## నంబర్ ప్లేట్లు సక్రమంగా ఏర్పాటు చేసుకోవాలి..

# హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి






**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 21:** వాహనాలకు నంబర్ ప్లేట్లను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవడంతో పాటు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కాకినాడ జిల్లా పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ ఎం. కిషోర్ కుమార్ పర్యవేక్షణలో కాకినాడ ట్రాఫిక్--1 పోలీసులు శుక్రవారం పట్టణంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, నంబర్ ప్లేట్ల ఏర్పాటు, ట్రాఫిక్ నిబంధనల పాటింపుపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలు, ప్రాణనష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పోలీసులు తెలిపారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలతో కూడిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాహనాలకు వినియోగించాలని సూచించారు. వాహనం ముందు, వెనుక భాగాల్లో నంబర్ ప్లేట్లు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నంబర్ ప్లేట్లపై అంకెలను మార్చడం, చెరిపివేయడం, వంకరగా చేయడం, అస్పష్టంగా కనిపించేలా చేయడం, ఫాన్సీ లేదా స్టైలిష్ నంబర్ ప్లేట్లు, పేర్లు, స్టిక్కర్లు, ఇతర గుర్తులు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు.నంబర్ ప్లేట్లను ఉద్దేశపూర్వకంగా దాచడం, మార్చడం లేదా గుర్తుపట్టలేని విధంగా ఏర్పాటు చేస్తే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనం నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడటం లేదా మొబైల్ ఫోన్ వినియోగించరాదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మోటార్ వెహికల్స్ చట్టం, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై జరిమానాలు, చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్--1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఎస్ఐ సి.హెచ్. బోసుబాబు, ట్రాఫిక్--1 పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజగోపాలస్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

-వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 21:** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ రాజగోపాల్ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ధర్మవరం గ్రామంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రీ వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన భజన సమాజాల ఏకాహ కార్యక్రమంలో ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.భజన కమిటీ ఆహ్వానం మేరకు గ్రామంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాలస్వామి దేవస్థానానికి చేరుకుని ఆయన కలశం ఏర్పాటు చేసి ఏకాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని ఏకాహ కార్యక్రమ నిర్వహణకు రూ.5 వేల రూపాయలు విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు,కోలా తాతబాబు,మాజీ సొసైటీ అధ్యక్షుడు బొల్లు రాజుబాబు,బొల్లు నల్ల అబ్బాయి,పాల నూకరాజు,కుప్పిన శ్రీను,సిద్దా కాశీతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఏడు వారాల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 21** శ్రావణ శుక్రవారం సందర్భంగా వాడపల్లి చందన వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి ఏడు వారాల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డికి ఆలయ అధికారులు, సిబ్బంది సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో కొనసాగుతున్న ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకున్న ఆయన, ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు.

ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని ఆయనకు అందజేసి సత్కరించారు.



శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నేపథ్యంలో అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో ప్రశాంతంగా కొనసాగింది.

## 22న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 21:**ఆత్రేయపురంమండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 22న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు పి. వరప్రసాదరావు, ఎ. సత్యనారాయణ తెలిపారు. సమావేశాల ద్వారా ఉపాధ్యాయుల బోధనా అనుభవాలు, విద్యార్థుల అభ్యసన స్థాయులు, పాఠశాలల విద్యా ప్రగతిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయుల సమావేశాలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. 22న ప్రతి ప్రాథమిక పాఠశాల నుంచి 50 శాతం మంది ఉపాధ్యాయులు పేరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశానికి హాజరుకావాలి. మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులు 29న అంకంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రెండో విడత సమావేశానికి హాజరుకావాలని అధికారులు సూచించారు.ప్రాథమికోన్నత స్థాయి సబ్జెక్టు ఉపాధ్యాయుల సమావేశాలు కూడా 22న నిర్వహించనున్నారు. లెక్కలు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల సమావేశం ఆత్రేయపురం మండలంలోని ర్యాలి జడ్పీ ఉన్నత పాఠశాలలో, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం ఉపాధ్యాయుల సమావేశం రావులపాలెం జడ్పీ (బాలురు) ఉన్నత పాఠశాలలో జరుగుతుందని తెలిపారు.సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అధికారులు కోరారు. సమావేశంలో చర్చించిన అంశాలను తరగతి గది బోధనలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు. అలాగే సమావేశానికి హాజరైన ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఫీడ్‌బ్యాక్ గూగుల్ ఫారమ్‌ను నమోదు చేయాలని స్పష్టం చేశారు.
ఉపాధ్యాయులందరూ నిర్ణీత సమయానికి సమావేశాలకు హాజరై, విద్యా సంబంధిత అంశాలపై చురుకుగా పాల్గొని సమావేశాలను ఫలవంతం చేయాలని ఎంఈఓలు పి. వరప్రసాదరావు, ఎ. సత్యనారాయణ కోరారు.

## పుల్లేటికుర్రు లో ఇంటింటికి తెలుగుదేశం రెండేళ్ళ నమ్మకం




**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 22:** మండలం పుల్లేటికుర్రు గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం. ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తున్న పి. గన్నవరం తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, పుల్లేటికుర్రు సొసైటీ చైర్మన్ దొమ్మేటి సురేష్. దొమ్మేటి ప్రభాకరరావు.రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్, సొసైటీ సభ్యులు పెచ్చెట్టి హరిబాబు . టీడీపీ నాయకులు ఇళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

ఇళ్లలో ప్రత్యేక పూజలు.. అమ్మవారికి నైవేద్యాలు సమర్పణ





**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 21:**శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఇళ్లలో ప్రత్యేకంగా పూజా మండపాలను ఏర్పాటు చేసి, పూలు, పండ్లు, మామిడి ఆకులు, కలశంతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు దీపారాధన చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.
వరలక్ష్మీదేవిని సంపద, సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సుకు ప్రతీకగా భావిస్తూ మహిళలు వ్రతాన్ని ఆచరించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా పలు రకాల పిండి వంటలు, పండ్లు, ఇతర నైవేద్యాలను సమర్పించారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.
ఈ సందర్భంగా ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక భక్తిభావాన్ని చాటుకున్నారు.


# కూటమి ప్రభుత్వంలో జనసేనకు చుక్కెదురా..?

- అభివృద్ధి పనుల్లో వైసీపీకి పెద్దపీట..!
- అభివృద్ధి పనులకు ఆహ్వానానికి నోచుకోని జనసేన నాయకులు....



**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 21:-** రాష్ట్రంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామస్థాయి నుంచి అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని కూటమి నేతలు పదే పదే చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, స్థానిక కార్యక్రమాల్లో జనసేన నాయకులకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో
శంఖవరం మండలం కొత్తూరు గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు గురువారం మండల నిధులతో పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. అయితే ఈ కార్యక్రమానికి కూటమిలో భాగస్వామ్యమైన జనసేన పార్టీ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీగా ఉన్న జనసేనకు అభివృద్ధి కార్యక్రమాల్లో కనీస గౌరవం, సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.
జనసేనను పక్కనపెట్టి వైసీపీ నేతలకు ఆహ్వానమా?
కొత్తూరులో జరిగిన పైప్‌లైన్ పనుల ప్రారంభ కార్యక్రమంలో జనసేన నాయకులను పక్కనపెట్టి గతంలో కూటమికి వ్యతిరేకంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికంగా ప్రభావం ఉన్న వ్యక్తులను కార్యక్రమానికి దగ్గరగా తీసుకురావడంపై జనసేన శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కూటమి అధికారంలోకి రావడానికి మూడు పార్టీల కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేశారని, అలాంటప్పుడు అభివృద్ధి పనుల్లో కూడా భాగస్వామ్య పార్టీలకు సముచిత ప్రాధాన్యం ఉండాలని కోరుతున్నారు.
ఎన్నికల్లో కష్టపడిన వారికి ఇదే గౌరవమా?
కూటమి ప్రభుత్వ ఏర్పాటులో జనసేన పార్టీ పాత్రను విస్మరించలేమని, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కనీస గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని జనసేన శ్రేణులు అంటున్నాయి. విజయవాడ రైల్వే డివిజనల్ వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు కూడా కూటమి విజయానికి, జనసేన పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని వారు గుర్తుచేస్తున్నారు.
ఎన్నికల సమయంలో పార్టీ కోసం శ్రమించిన నాయకులకు అభివృద్ధి కార్యక్రమాల సమయంలో కనీస సమాచారం కూడా ఇవ్వకపోతే కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
కూటమి ధర్మం పాటించాలి
టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో గ్రామ స్థాయిలో కూడా మూడు పార్టీల మధ్య సమన్వయం ఉండాలని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల కోసం నిర్వహించేవే అయినప్పటికీ.. వాటి నిర్వహణలో అధికార, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం లేకపోవడం అనవసర రాజకీయ విభేదాలకు దారితీయవచ్చని అంటున్నారు.
కొత్తూరు పైప్‌లైన్ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు కూటమి పార్టీల మధ్య సమన్వయంపై మరోసారి చర్చకు దారితీశాయి. భవిష్యత్తులోనైనా అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కూటమిలోని అన్ని పార్టీల నాయకులకు ముందస్తు సమాచారం అందించి, అందరికీ సముచిత ప్రాధాన్యం కల్పించాలని జనసేన శ్రేణులు కోరుతున్నాయి.
"కూటమి కోసం కలిసి పనిచేసిన నాయకులను పక్కనపెట్టి.. రాజకీయంగా భిన్న వైఖరి కలిగిన వారిని దగ్గర చేసుకోవడం సరికాదు. కూటమి ధర్మాన్ని క్షేత్రస్థాయిలోనూ పాటించాలి" అని జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతం



**కరప:** మండలవ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసంలో వరలక్ష్మీదేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయనే నమ్మకంతో ఇళ్లల్లో అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలు, పిండివంటలతో విశేషంగా పూజించారు.
ఈ సందర్భంగా కరప, అరట్లకట్ట, వేములవాడ, వలసపాకల, పెనుగుదురు, యండమూరు తదితర గ్రామాలలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకుడు కొంపెల్ల చక్రధర్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే స్థానిక విష్ణాలయం, యండమూరు వెంకటేశ్వరస్వామి, పెనుగుదురు సంతోషిమాత ఆలయాల్లో అమ్మవార్లను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కాశీవారాహి ఆలయానికి పోటెత్తిన భక్తులు





**ఒకరప, పెన్ పవర్, ఆగస్టు 21:** కరప మండలం కొరుపల్లిలో వెలసిన కాశీ వారాహిమాత ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది.
వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా అమ్మవారిని తామరపువ్వులో నిలబడినట్లుగా ఆకర్షణీయంగా అలంకరించారు.
ఇరుపక్కలా వరలక్ష్మీదేవి చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
కరప, పెనుగుదురు, కొరిపల్లితో పాటు పరిసర మండలాల నుంచి 600 మంది మహిళలు తరలివచ్చి సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరుల ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి శుక్రవారం కుంకుమపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
అర్చకుడు చెరుకూరి రవిశర్మ నేతృత్వంలో వేదపండితులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. పూజలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, రవిక అందజేశారు.

## యువ నాయకుడు బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు ఘనంగా





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 21:** సేవా కార్యక్రమాలతో యువ నాయకుడు బండారు సంజీవ్ జన్మదిన వేడుకలను ర్యాలి గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడైన సంజీవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల పార్టీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, గ్రామ టీడీపీ నాయకుడు పాలింగి రవిచంద్ర ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.ర్యాలి గ్రామంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి బండారు సంజీవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను నిర్వహించారు. అనంతరం ఊబలంక గ్రామంలోని మదర్ తెరిస్సా అంధుల మనోవికాస కేంద్రాన్ని సందర్శించిన నాయకులు, అక్కడి పిల్లలకు స్వీట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమంతో నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్నారని నాయకులు పేర్కొన్నారు. నిరుపేదలు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంజీవ్‌కు ఆయురారోగ్యాలు, రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దూరు సుబ్బారావు, పెండెం వెంకన్న, పాలింగి రవిచంద్ర, తోట రజిని, గార్లపాటి గోపాలకృష్ణమూర్తి, గూడెల నాగేంద్ర, కోటారపు మణికంఠ, దిడ్ల సురేష్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి.

-బూరుగుపూడి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో టిడిపి నాయకులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 21**:రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధించడమే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు సక్రమంగా అందుతున్నాయని కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామ టిడిపి నాయకులు అన్నారు. రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమపై బూరుగుపూడి గ్రామ ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుంచే తాతాజీ, పాఠంశెట్టి నాగేశ్వరరావు, పాఠంశెట్టి విశ్వనాథం,బాలుకుల చిన్నోడు,మూరా సత్తిబాబు,వజ్రపు శేఖర్, పాటంశెట్టి గణేష్,బాలిన వెంకటేశ్వరరావు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

